
తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-30-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 301 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# తల్లిదండ్రుల రక్షణకు కొత్త చట్టం తీసుకొస్తాం

"పేరెంటల్ సపోర్ట్ బిల్లు-2026"పై సభలో చర్చ

వృద్ధుల భద్రతకు కీలక ముందడుగు

సమాజానికి సీఎం రేవంత్ బాధ్యతాయుత సందేశం



**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. శాసనసభలో మంత్రి ఆదిలూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టిన "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026"పై సీఎం మాట్లాడారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత కల్పించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరించే వారికి భయం కలిగించడమే ఈ బిల్లుకు ఉద్దేశమని పేర్కొన్నారు. వృద్ధుల సంరక్షణలో ఇది కీలకమైన అడుగు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో బంధాలు, అనుబంధాలు తగ్గిపోతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో..

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి కవిత మద్దతు

గత ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగ క్షమాపణ

సమస్య పరిష్కారం కోసం కఠిన హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్వహించిన ధర్నాకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులకు జాగృతి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో భాగంగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయినందుకు బహిరంగంగా క్షమాపణ కోరారు.

మిగతా 2లో..





# అక్రమ మైనింగ్ ఆరోపణలపై కేటీఆర్ ఫైర్

- మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- హౌస్ కమిటీ లేదా న్యాయ విచారణ కోరుతూ హెచ్చరిక
- గవర్నర్‌ను కలుస్తామని, ప్రజల్లోకి వెళ్తామని స్పష్టం

**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

మిగతా 2లో..



# గోదావరి పుష్కరాలకు భారీ ప్రణాళికలు: సీఎం సమీక్ష

బాసర నుంచి భద్రాచలం వరకు సమగ్ర అభివృద్ధి

టెక్నికల్ కమిటీతో క్షేత్రస్థాయి పరిశీలనలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లపై దృష్టి

**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** 2027 జూన్‌లో జరగబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ సమావేశ హాలులో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ఆలయాలు, పుష్కరఘాట్ల అభివృద్ధిపై మంత్రివర్గ ఉపసంఘంతో కలిసి విస్తృతంగా చర్చించారు. పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన అన్ని పనులను సమయానికి పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. అధికారులు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, వాటిపై సీఎం పలు కీలక సూచనలు చేశారు. పుష్కరాల సమయంలో లక్షలాది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు ఇంజనీర్లతో ప్రత్యేక టెక్నికల్ కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి 15 నుంచి 20 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

మిగతా 2లో..

# మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు నాంది: మంత్రి పొన్నం

290 కోట్ల ఉచిత ప్రయాణాలు – 10,000 కోట్ల ఆదా

మహిళల ఆర్థిక స్వావలంబనలో కీలక పురోగతి

ప్రజా రవాణా వినియోగానికి మంత్రి పిలుపు



**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో అమలవుతున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, మహిళలు దాదాపు రూ.10,000 కోట్ల రవాణా ఖర్చును ఆదా చేసుకున్నారని వెల్లడించారు.

మిగతా 2లో..

# కౌశిక్ రెడ్డి వ్యవహారం అసెంబ్లీలో దుమారం

- ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేసిన స్పీకర్ నిర్ణయం
- దళిత నేత కడియం శ్రీహరి అంశంపై రాజకీయ వేడి
- కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రతిఆరోపణలు

**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పి. కౌశిక్ రెడ్డి వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. సీనియర్ నేత కడియం శ్రీహరి పట్ల అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

మిగతా 2లో..





# అక్రమ మైనింగ్ ఆరోపణలపై తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

మంత్రి పొంగులేటిపై తీవ్ర విమర్శలు – బీఆర్ఎస్ డిమాండ్లు

హౌస్ కమిటీ లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ కోరిన హరీష్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వంపై 20 కుంభకోణాల ఆరోపణలు

**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసే వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్‌లో పాల్గొన్నారని ఆరోపిస్తూ, ఈ విషయం ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు స్పష్టమైందన్నారు. టీవీల్లో వెలువడిన సమాచారంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కూడా ఈ అంశం బహిర్గతమైందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో..

# కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీ చర్యలు రాజకీయ వేధింపులే: ప్రశాంత్ రెడ్డి

- అసలు లేని విషయాలతో విచారణ కోరడం అన్యాయం అని వ్యాఖ్య
- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సభ గౌరవం కాపాడాలంటే అందరిపై సమాన విచారణ అవసరం



**హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయడం రాజకీయ వేధింపులేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. అసలు లేని విషయాలను సృష్టించి ఆయనపై విచారణ కోరడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కౌశిక్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని ప్రశాంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తల్లిదండ్రుల రక్షణకు కొత్త చట్టం తీసుకొస్తాం


(మొదటి పేజీ తరువాయి)

భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం పేగు బంధాలను కూడా విస్మరించే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.
తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితులు సమాజానికి మేలు చేయవని వ్యాఖ్యానించారు.
పిల్లలు, మహిళల రక్షణ కోసం ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. బాలల హక్కులు, మహిళల భద్రత, వృద్ధుల సంక్షేమానికి సంబంధించి దేశంలో పలు చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. శ్రవణ కుమారుడి కథను ఉదాహరణగా చెప్పిన సీఎం, తల్లిదండ్రుల పట్ల భక్తి, గౌరవం పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ పథ్ సింఘానియా జీవితాన్ని ప్రస్తావిస్తూ, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే పరిణామాలను సభకు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. ఈ బిల్లుతో వృద్ధ తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అన్ని పక్షాలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

# అక్రమ మైనింగ్ ఆరోపణలపై తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయిందని, డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని హరీష్ రావు విమర్శించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అవినీతిపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిజాలను దాచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీలో అక్రమ మైనింగ్‌పై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని, అదే సమయంలో సీబీసీఐడీ విచారణ అంటూ ప్రభుత్వం ముందుకు రావడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ అంశంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసినప్పటికీ, ప్రభుత్వం స్పందించలేదని హరీష్‌రావు అన్నారు. నిష్పక్షపాత విచారణ కోసం



హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో విచారణపై ప్రజలకు నమ్మకం ఉండదని స్పష్టం చేశారు.
దళితుల అంశాన్ని కూడా హరీష్ రావు ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై కపట ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దళిత సంక్షేమానికి భారీ నిధులు కేటాయించామని, ప్రస్తుతం ఆ స్థాయిలో కేటాయింపులు లేవని తెలిపారు. దళితబంధు వంటి పథకాల ద్వారా బీఆర్ఎస్ నిజంగా దళితుల అభివృద్ధికి కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేతలపై ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కౌశిక్ రెడ్డిపై జరిగిన చర్యలను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ వ్యవహారాన్ని కూడా ప్రశ్నిస్తూ, ఇది రాజకీయ కుట్రలో భాగమని వ్యాఖ్యానించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక కుంభకోణాలు జరిగాయని హరీష్ రావు ఆరోపించారు. మొత్తం 20 స్కాములపై ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్ వల్ల రాష్ట్ర ఖజానాకు వందల కోట్లు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని, ప్రజల ముందుకు నిజాలను తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి కవిత మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ఆ సమయంలో జరిగిన తప్పుల్లో తనకూ భాగం ఉందని అంగీకరిస్తూ, ఉద్యోగులందరిని క్షమించాలని కోరారు. ఇది రాజకీయంగా అరుదుగా కనిపించే స్వీయ విమర్శగా నిలిచింది. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వంపై అదనపు భారం లేకుండా సమస్యలను పరిష్కరించే మార్గాలు ఉన్నప్పటికీ, ఏజెన్సీలకు మద్దతు ఇస్తూ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మధ్యవర్తి ఏజెన్సీలను తొలగించి, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించే విధానం తీసుకురావాలని సూచించారు. ఈ విధానం అమలు చేస్తే ఉద్యోగులకు భద్రత, హక్కులు కల్పించవచ్చని తెలిపారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల ద్వారా ఎంపికైనప్పటికీ వారికి సరైన హక్కులు, సౌకర్యాలు అందడం లేదని పేర్కొన్నారు. కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని అన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్ వీధుల్లో భారీ స్థాయిలో ఉద్యోగులు మార్చ్ చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించాల్సి వస్తుందని తెలిపారు. సమస్యకు పరిష్కారం దొరికే వరకు పోరాటం కొనసాగుతుందని, జాగృతి తరఫున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# అక్రమ మైనింగ్ ఆరోపణలపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ అసెంబ్లీ వద్ద గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో నిరసన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసన సభ పక్ష ఉపనేత హరీష్ రావు ఆధారాలతో సహా ఒక మంత్రి కుటుంబానికి చెందిన సంస్థ అక్రమ మైనింగ్‌కు పాల్పడిందని బయటపెట్టారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్ల ఆధారంగానే ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. ఇతర సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకున్న ప్రభుత్వం, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై మాత్రం చర్యలు తీసుకోవడంలేదని కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి కుటుంబానికి చెందిన సంస్థ కావడం వల్లనా, లేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఉండడం వల్లనా చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యల్లో విరుద్ధతలు ఉన్నాయని విమర్శించారు. అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని కేవలం చిన్న మొత్తంగా చూపించడం సిగ్గుచేటని కేటీఆర్ అన్నారు. అధికారుల దాడుల్లో బయటపడిన వివరాలను ప్రస్తావిస్తూ, రెండున్నరేళ్లలో జరిగిన అవినీతి పరిమాణం భారీగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన మైనింగ్ ఆదాయంలో భారీ లోటు ఉందని ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై సభా సంఘం ఏర్పాటు చేసి మంత్రి, ముఖ్యమంత్రి సహా అందరి పాత్రలను బయటపెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గతంలో ఓబులాపురం మైనింగ్ కేసులో హౌస్ కమిటీ ఏర్పాటు చేసినట్లే ఇప్పుడు కూడా పారదర్శక విచారణ జరపాలని కోరారు. అవసరమైతే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సూచించారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే భయపడాల్సిన అవసరం లేదని కేటీఆర్ అన్నారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదని, అవసరమైతే ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా తీసుకెళ్తామని హెచ్చరించారు. మంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో ప్రతిపక్షానికి మైక్ నిరాకరణపై విమర్శలు



హైదరాబాద్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):

- మైనింగ్ అంశంపై మాట్లాడనివ్వడంలేదని ఆరోపణ
- ప్రభుత్వ వైఖరిపై సునీతా లక్ష్మారెడ్డి ఆగ్రహం
- అక్రమ మైనింగ్ అంశం దారి మళ్లిస్తున్నారన్న వ్యాఖ్యలు

అసెంబ్లీలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. నిన్న, ఈరోజు ప్రతిపక్ష సభ్యులు మాట్లాడాలని ప్రయత్నించినప్పటికీ మైక్ ఇవ్వలేదని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులపై మాత్రమే మాట్లాడితే మైక్ ఇస్తామని, మైనింగ్ వంటి కీలక అంశాలపై మాట్లాడితే అవకాశం ఇవ్వడంలేదని ఆమె అన్నారు. ప్రతిపక్షం కూడా ప్రభుత్వం చెప్పినట్టే నడవాలని ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు.
ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నారన్న ప్రశ్న అడిగితే కాంగ్రెస్ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారని సునీతా లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రశ్నలు అడిగే హక్కును కూడా నిరోధిస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఉన్న అక్రమ మైనింగ్ ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలు, అవినీతి అంశాలను ప్రస్తావించకుండా అడ్డుకోవడం సరైంది కాదని ఆమె స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీరును మార్చుకోకపోతే ప్రజల ముందుకు ఈ విషయాలను తీసుకెళ్తామని సునీతా లక్ష్మారెడ్డి హెచ్చరించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు.

# గోదావరి పుష్కరాలకు భారీ ప్రణాళికలు: సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీర్ల కమిటీ నివేదికను అధికారుల కమిటీ సమగ్రంగా పరిశీలించి పూర్తి అంచనాలతో మంత్రివర్గ ఉపసంఘానికి పంపించాలని సీఎం తెలిపారు. ఉపసంఘం ఆమోదించిన అనంతరం గోదావరి పుష్కరాల సమగ్ర ప్రణాళికపై మంత్రిమండలి తుది నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. పారదర్శకంగా, వేగవంతంగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యత క్రమంలో అమలు చేయాలని సీఎం ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన ఆలయాలు, పర్యాటక కేంద్రాల్లో ఘాట్ల నిర్మాణం, విస్తరణతో పాటు రహదారి, రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని చెప్పారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై కూడా సీఎం ప్రత్యేకంగా చర్చించారు. భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులు పాల్గొని పుష్కరాల విజయవంత నిర్వహణకు తమ సూచనలు తెలియజేశారు.

# మహాలక్ష్మి పథకం మహిళల సాధికారతకు నాంది: మంత్రి పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబనను బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో ప్రయాణానికి ఖర్చు చేసిన మొత్తాన్ని ఇప్పుడు కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఉపాధి అవకాశాల కోసం వినియోగించే స్థితికి మహిళలు చేరుకోవడం పథక విజయానికి నిదర్శనమని అన్నారు. ప్రతిరోజూ లక్షలాది మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలకు పట్టణాలకు సులభంగా ప్రయాణించే అవకాశాన్ని ఈ పథకం కల్పించిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా ప్రభుత్వ విధానాలు మహిళా సాధికారతకు బలమైన పునాది వేస్తున్నాయని మంత్రి అన్నారు. మహాలక్ష్మి పథకం ఆ దిశలో ఒక చారిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న టీజీఎస్ ఆర్టీసీ సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రజలు కూడా ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా వినియోగించాలని కోరారు. మహాలక్ష్మి పథకం కేవలం ఉచిత ప్రయాణ సౌకర్యం మాత్రమే కాకుండా మహిళల గౌరవం, ఆర్థిక భద్రత, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడే గొప్ప కార్యక్రమమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీ చర్యలు రాజకీయ వేధింపులే: ప్రశాంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు.
నిజంగా ఎథిక్స్ కమిటీ ఉంటే ముందుగా సభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
సభలో జరిగిన ప్రతి అంశాన్ని సమానంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కమిటీపై ఉందని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో చేసిన వ్యాఖ్యలను కూడా ప్రశ్నించారు. స్పీకర్ సమక్షంలోనే అనుచిత వ్యాఖ్యలు జరిగాయని, వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రిని కూడా ఎథిక్స్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. సభ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎవరు వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకోవాలని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కరిని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని, సమాన న్యాయం ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, సమానత్వం కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎథిక్స్ కమిటీ చర్యలు నిష్పక్షపాతంగా ఉండాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా వ్యవహరించాలని సూచించారు.

# కౌశిక్ రెడ్డి వ్యవహారం అసెంబ్లీలో దుమారం

(మొదటి పేజీ తరువాయి)

ఇంతకుముందు శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు సభలో ఈ మేరకు తీర్మానం ప్రవేశపెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు, ఆయన ప్రవర్తన ఒక సీనియర్ దళిత నేతను అవమానించేలా ఉన్నాయని అధికార కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కడియం శ్రీహరి వంటి సీనియర్ నేతను అవమానించడం తగదని పేర్కొంటూ, ఈ విషయంపై ఎథిక్స్ కమిటీ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై సీఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. దళితుల పట్ల గతంలో జరిగిన అన్యాయాలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దళిత నేతలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక స్థానాలను కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఈ చర్యలను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ డైవర్షన్ పాలిటిక్స్ అని ఆరోపించారు. రెవెన్యూ మంత్రిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మరల్చేందుకే ఈ చర్యలు తీసుకున్నారని విమర్శించారు.
ఇటీవల బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌కు చేరువైన ఎమ్మెల్యేలలో కడియం శ్రీహరి కూడా ఒకరని ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారి తీసింది.



# వైభవంగా బంగారు మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు

**నాచారం, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

నాచారం డివిజన్ శ్రీరామ్ నగర్‌లోని బంగారు మైసమ్మ దేవాలయం వార్షికోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. త్వరలోనే పటేల్ కుంట చెరువును సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎర్రగుంట, శ్రీరామ్ నగర్, గాంధీనగర్, అంబేద్కర్ నగర్, ఎరుకల బస్తి, బాబా నగర్, నాచారం విలేజ్, హనుమాన్ నగర్, రామ్ రెడ్డి నగర్ ప్రాంతాల్లో దోమల సమస్యను నివారించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్, విఠల్ యాదవ్, రామ్ చందర్, కట్ట బుచ్చన్న గౌడ్, అంజి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# కమలాబాయి నగర్‌లో మౌలిక వసతుల కోసం బస్తీ వాసుల వినతిపత్రం

- డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై ఆవేదన
- త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని సాయిజన్ శేఖర్ హామీ

**నాచారం, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని కమలాబాయి నగర్‌లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక బస్తీ వాసులు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయిజన్ శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రోడ్లు దెబ్బతినడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని వారు తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకుని ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు.దీనిపై స్పందించిన సాయిజన్ శేఖర్ మాట్లాడుతూ, గతంలో కమలాబాయి నగర్ మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఉండటం వల్ల అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని పేర్కొన్నారు. ప్రస్తుతం నాచారం డివిజన్‌లోకి రావడంతో ఎమ్మెల్యే సహకారంతో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనుస్, కాసిం, యాదన్న, ఎండి హుస్సేన్, బొజ్జ కన్నా, అబ్రార్, గౌస్ భాయ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.




# పేదల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం

- రాంపల్లి గ్రామంలో ప్రజల స్పందన విశేషం

**నాగారం, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గం కీసర మండలం రాంపల్లి గ్రామంలోని ఎస్సి కాలనీ అంగన్‌వాడీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రజల నుంచి విశేష స్పందనను పొందింది. కమలానగర్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ మరియు కీసర సీఐటీయూ మండల కమిటీలు సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాయి.శిబిరాన్ని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వైద్య సేవలు అధిక ఖర్చుతో కూడుకున్నవిగా మారాయని, పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు కాటరాక్ట్ శస్త్రచికిత్సలు ఉచితంగా చేయిస్తున్నామని పేర్కొన్నారు.శిబిరంలో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్‌కు చెందిన అనిల్ కుమార్ బృందం కళ్ల పరీక్షలు నిర్వహించగా, దమ్మాయిగూడ మరియు సాకేత్-పద్మ సాయి డెంటల్ క్లినిక్స్‌కు చెందిన డాక్టర్ దినేష్ నమిలే బృందం దంత పరీక్షలు చేపట్టారు. అలాగే కమలానగర్ శ్రీకర హాస్పిటల్ వైద్యులు బీపీ, షుగర్, సాధారణ పరీక్షలతో పాటు ఆర్థో, న్యూరో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. నాగారం కుమారి వెల్నెస్ కార్యక్రమం కూడా నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 143 మంది పాల్గొని వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ట్రస్ట్ తరఫున రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సిహెచ్ వరప్రసాద్, ట్రస్ట్ నాయకులు జీవీ రావు, పురుషోత్తం రెడ్డి, సంతోషి, సీఐటీయూ కీసర మండల నాయకులు చింతకింది అశోక్, కాంప్ కోఆర్డినేటర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరెడీమేట్–యాప్రల్‌లో శిక్షణ మహాభియాన్ విజయవంతం

- ముఖ్య అతిథి ఎంపీ ఈటెల రాజేందర్
- కార్యకర్తలకు మార్గదర్శనం

**నేరెడీమేట్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**





మల్కాజ్గిరి నియోజకవర్గం నేరెడీమేట్ మరియు యాప్రల్ డివిజన్‌లలో నిర్వహిస్తున్న పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ - 2026 శిక్షణ తరగతులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మొదటి రోజు కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, కార్యకర్తలు సిద్ధాంతాలను అవగాహన చేసుకుని ప్రజాసేవలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమం లో గీత మూర్తి (నేషనల్ కౌన్సిలింగ్ మెంబర్), వేముల వేణుగోపాల్ (స్టేట్ సోషల్ మీడియా కోకన్వీనర్), అకెళ్ళ శర్మ (సీనియర్ నాయకుడు), మల్లిక (క్లస్టర్ ఇంచార్జి) పాల్గొని శిక్షణార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర పార్టీ నుంచి విశిష్ట అతిథిగా బద్దం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య భరద్వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, గోపు రమణ రెడ్డి, సత్య నారాయణ, శర్మ, పరాస్ జైన్, రాజి రెడ్డి, శ్యామ్, పర్వతాలు దినేష్, కృష్ణ మోహన్, బీర్ సింగ్, సుదర్శని, మల్లిక, శాలిని తదితర నాయకులు పాల్గొన్నారు.అలాగే డివిజన్ కమిటీ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేశారు.





# గద్దర్ అవార్డు అందుకున్న మహా మనిషి డా. ఏఎస్ రావు డాక్యుమెంటరీ

- డా. ఏఎస్ రావు విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘన సన్మాన సభ
- ప్రముఖుల ప్రశంసలు

**ఏఎస్ రావు నగర్, మార్చి 29(తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ డా. ఏఎస్ రావు విజ్ఞాన వేదిక నిర్మించిన “మహా మనిషి డాక్టర్ ఏఎస్ రావు” డాక్యుమెంటరీ చిత్రానికి గద్దర్ అవార్డు లభించిన సందర్భంగా శనివారం రాత్రి స్థానిక హోమీ జే బాబా ఫంక్షన్ హాల్‌లో ఘన కార్యక్రమం నిర్వహించారు.సభకు ముందు డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు.దాశరధి థియేటర్స్ ఉపాధ్యక్షులు, టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు ఆకర్షణీయంగా ఆహ్వాన ప్రసంగం చేసి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ముఖ్య అతిథి ఈశ్వరయ్య డాక్టర్ ఏఎస్ రావు చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజ్ఞాన వేదిక అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ, డాక్యుమెంటరీ నిర్మాణం ఇదే వేదికలో నిర్ణయించి, అందరి సహకారంతో తక్కువ కాలంలో పూర్తి చేసి పలు అవార్డులు సాధించడం గర్వకారణమన్నారు. ప్రధాన కార్యదర్శి పి.బి. చారి నివేదికను సమర్పిస్తూ, ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే వేదిక లక్ష్యమని తెలిపారు. డాక్యు మెంటరీ దర్శకుడు రఘురామచంద్ర, బీడీఎల్ సత్యనారాయణల కృషిని అభినందిస్తూ, నటీనటులు, సాంకేతిక బృందం సహకారంతో చిత్రం విజయవంతమైందన్నారు.
ముఖ్య అతిథి ఈశ్వరయ్య మాట్లాడుతూ, డాక్టర్ ఏఎస్ రావు చేసిన త్యాగాలు, దేశాభివృద్ధికి ఆయన చూపిన మార్గం ఈ చిత్రం ద్వారా స్పష్టమైందని అన్నారు. ఈ చిత్రాన్ని విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని కోరారు.మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ, ఈ ప్రాంత అభివృద్ధికి డాక్టర్ ఏఎస్ రావు చేసిన సేవలు అపారమని కొనియాడారు. దాశరధి థియేటర్స్ అధ్యక్షులు ఎస్. వినయ్ కుమార్ డాక్యుమెంటరీ నిర్మాణంలో భాగస్వాములైన వారిని అభినందించారు. డాక్టర్ ఏఎస్ రావు సన్నిహితుడు ప్రేమ్ చంద్ తన అనుభవాలను పంచుకున్నారు.అనంతరం చిత్రంలో పాల్గొన్న నటీనటులు, సాంకేతిక సిబ్బందిని అతిథులు మెమొంటోలు, చేనేత వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సభ్యులు, స్థానికులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నోమ బస్ స్టాప్ వద్ద చలివేంద్రం ప్రారంభం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- ప్రజలకు మజ్జిగ పంపిణీ

**మీర్పేట్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గంలో నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ పరిధిలోని నోమ బస్ స్టాప్ సమీపంలో వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు, మజ్జిగ వంటి శీతల పానీయాలు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. స్వర్గీయ ముస్కె సరస్వతి యాదవ్ జ్ఞాపకార్థంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో, దాత రాజమల్లు యాదవ్ కుటుంబ సభ్యుల సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



ఈ కార్యక్రమంలో నాయకులు వాసు గౌడ్, ఉస్మాన్, పాండాల నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, కృష్ణ, దయాకర్ పాల్గొన్నారు.అలాగే యాదవ సంఘం అధ్యక్షులు అల్లాడి కృష్ణ యాదవ్, పల్లె కుమార్ యాదవ్, గద్దం కృష్ణ యాదవ్, మల్లేష్ యాదవ్, సూరం రాజేష్ తదితరులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మల్లాపూర్‌లో “బస్తీ బాట” విజయవంతం

- ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ఫోకస్
- డ్రైనేజ్, తాగునీరు, చెత్త నిర్వహణ, స్ట్రీట్ లైట్ల సమస్యలపై వెంటనే చర్యలు
- నెమలి అనిల్ కుమార్ హామీ

**మల్లాపూర్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం, నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్, జయశంకర్ కాలనీ ప్రాంతాల్లో నిర్వహించిన “బస్తీ బాట” కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ పాల్గొని స్థానిక ప్రజలతో నేరుగా మమేకమయ్యారు.ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం, తాగునీటి కొరత, చెత్త సేకరణలో లోపాలు, కొత్త స్ట్రీట్ లైట్ల అవసరం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని వివరించారు.ఈ సమస్యలపై స్పందించిన నెమలి అనిల్ కుమార్, వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపించేందుకు చర్యలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి సమస్యను సవివరంగా విని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ప్రజలతో నేరుగా మాట్లాడటం ద్వారా వారి విశ్వాసాన్ని మరింత బలపరిచిన ఈ కార్యక్రమం, కాలనీల అభివృద్ధికి ఒక ముందడుగుగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.




ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానిక ప్రతినిధులు నిక్కీ గౌడ్, జి. సోములు (జయశంకర్ కాలనీ ప్రెసిడెంట్), మిద్దెపాక క్రాంతి, రమేష్, తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, ఉండం శ్రీనివాస్, కోయల కొండ రాజేష్, బ్రహ్మచారి, రాజన్, వెంకటప్ప, హరి, అనిల్, మల్లేశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవం

- నెమలి అనిల్ కుమార్ పాల్గొని శుభాకాంక్షలు
- ఐక్యతతో అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య

**మల్లాపూర్, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం, నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లోని గ్రీన్ హిల్స్ కాలనీలో గ్రీన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీవాసులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, కాలనీ అభివృద్ధి కోసం సంఘం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. ప్రజల ఐక్యత, పరస్పర సహకారం ఉంటే అభివృద్ధి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడంలో నిర్వాహకుల కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, సంఘం సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : హాల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఉద్యోగ విరమణ సందర్భంగా రణదీప్‌కు ఘన సన్మానం

**వనపర్తి,మార్చి29(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల పాఠశాలలో సీనియర్ గణిత ఉపాధ్యాయుడిగా సేవలందించిన డి. రణదీప్ మార్చి 31, 2026న ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా వనపర్తిలోని ఆర్జీ గార్డెన్‌లో ఘనంగా సన్మానం, వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఉదయం 11 గంటలకు ఉపాధ్యాయుడు రణదీప్ దంపతులు కార్యక్రమానికి విచ్చేయగానే విద్యార్థులు పూలతో సత్కరించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమానికి పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్. వరప్రసాద్ రావు సభాధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి హాజరై రణదీప్ సార్‌ను ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. విద్యాశాఖకు ఆయనలాంటి ఉపాధ్యాయులు ఎంతో అవసరమని, ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి ఎం. మాధవి రమేష్ మండల విద్యాధికారులు శ్రీమతి ఎస్. మంజులత , జయశంకర్ గారు మాట్లాడుతూ రణదీప్ తన సేవలో అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ఏజీ ఆఫీస్ నుండి పెన్షన్ కమ్యూటేషన్, గ్రాట్యుటీ మంజూరు పత్రాలు, అలాగే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తరపున పంపిన ఉద్యోగ విరమణ పత్రాన్ని అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయులు బంగారు ఉంగరాన్ని బహూకరించగా, పిపిఎస్ సభ్యులు వెండి బ్రాస్ లైట్‌ను సమర్పించి సన్మానించారు.ప్రగతి స్కూల్ పూర్వ ఉద్యోగులు, పదవ తరగతి స్నేహితులు గజమాలతో ఘనంగా సత్కరించారు.పి.ఆర్.టి.యు, టి.ఎస్ సంఘాల నాయకులు, జిల్లా మరియు మండల స్థాయి ప్రతినిధులు పాల్గొని రణదీప్ సార్ సేవలను కొనియాడారు.గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం, ఎస్టీయూ, డిటిఎఫ్ సంఘాల ప్రతినిధులు కూడా హాజరై కార్యక్రమంలో భాగమయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ రణదీప్ సార్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ఉద్యోగ విరమణపై భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.చివరలో సభాధ్యక్షులు శ్రీ ఎస్. వరప్రసాద్ రావు విచ్చేసిన అతిథులు, ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



# హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

**భీమదేవరపల్లి, మార్చి 29:(తెలంగాణ ముచ్చట్లు):** ఏప్రిల్ 2న చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ముత్తారం గ్రామంలో టీటీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ద్వితీయ వార్షిక హనుమాన్ శోభాయాత్రకు సంబంధించి ఆహ్వాన పోస్టర్‌ను ఆదివారం టిటిడిఎస్ భక్తులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూ బంధువులంతా అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ఊరడి ప్రమీల రాంరెడ్డి కుటుంబ సభ్యులు ఏడు అడుగుల హనుమాన్ విగ్రహాన్ని సమకూర్చినట్లు తెలిపారు. “హిందూ బంధువులారా కదలిరండి... మన హిందువుల ఐక్యతను చాటుదాం” అనే నినాదంతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ హనుమాన్ శోభాయాత్రను దిగ్విజయం చేయాలని టీటీడీఎస్ భక్త బృందం గ్రామ ప్రజలకు పిలుపునిచ్చింది.



# పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వ – ఇద్దరు అరెస్ట్

**వేలేరు, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం బండతండా గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని వేలేరు పోలీసులు పట్టుకున్నారు.పెట్రోలింగ్ సమయంలో విశ్వసనీయ సమాచారం అందడంతో వెంటనే దాడి చేశారు.నారాయణగిరి గ్రామానికి చెందిన బొంత రఘు, ఎర్రబెల్లి గ్రామానికి చెందిన కలేరు నేతాజీని అదుపులోకి తీసుకున్నారు.నిందితులు తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.
ఆ బియ్యాన్ని కోళ్ల ఫారాలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విచారణలో వెల్లడైంది.
వ్యవసాయ షెడ్‌లో బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు పోలీసులు తెలిపారు.మొత్తం 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.దాని విలువ సుమారు రూ.60,000/గా అంచనా వేశారు.ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు



# ఉప్పల్ శిల్పారామంలో సృజన హై స్కూల్ రజతోత్సవం వేడుకలు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరు
- విద్యార్థుల ప్రతిభకు అభినందనలు

**ఉప్పల్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ శిల్పారామం ప్రాంగణంలో సృజన హై స్కూల్ 25వ వార్షికోత్సవం “రజతోత్సవం” వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, విద్యతోనే భవిష్యత్తును నిర్మించుకోవచ్చని ఆయన సూచించారు. పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎమ్మెల్యే ప్రశంసించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డంప్ యార్డ్‌పై హుజురాబాద్ గర్జన

- 7వ రోజుకు చేరిన దీక్ష

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ శివారులో ఏర్పాటు చేయనున్న డంప్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజల ఆగ్రహం రోజురోజుకూ ఉద్ధృతమవుతోంది. ఆదివారానికి ఈ నిరసన దీక్ష 7వ రోజుకు చేరుకోవడంతో ఉద్యమం మరింత ఉత్కంఠభరితంగా మారింది. 12వ వార్డు కౌన్సిలర్ రవీందర్ రావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా ప్రజలతో కిక్కిరిసిపోయింది.
ఈ సదర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ డంప్ యార్డ్ వల్ల గాలి, నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
హుజురాబాద్ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఈ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేశారు.
దీక్ష రోజు రోజుకూ ఉత్సాహం పెరుగుతుండటంతో, ఈ ఉద్యమం మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులు ఎలా స్పందిస్తారో అన్నదే ఇప్పుడు స్థానికుల్లో ఉత్కంఠగా మారింది.



# ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

- జెండా ఆవిష్కరణ, బైక్ ర్యాలీతో ఉత్సాహంగా వేడుకలు

**వనపర్తి,మార్చి29(తెలంగాణ ముచ్చట్లు):**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమాన్ టేకిడిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను రామన్ గౌడ్ ఎగురవేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగర్ కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ బి రాములు మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అని నినదించిన మహానేత ఎన్టీఆర్ సేవలు మరువలేనివని కొనియాడారు.అలాగే కమాన్ చౌరస్తాలో పెద్దమందడి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వనపర్తి పట్టణ ప్రధాన రహదారుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎండి దస్తగిరి రాష్ట్ర నాయకుడు, షాకీర్ హుస్సేన్ న్యాయవాది, వనపర్తి మండల నాయకులు చిట్యాల బాలరాజ్, అప్పాయపల్లి బాలయ్య, ఉపేందర్, దాసు, పెద్దమందడి మండల అధ్యక్షుడు పెద్ద శ్రీనివాస్ రెడ్డి , రాధాకృష్ణ, గణపురం మండల నాయకులు యాదయ్య, శ్రీను, పెబ్బేరు మండల నాయకులు సితార, వాకిటి బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు కె లక్ష్మయ్య, మేదరి బాలయ్య, ఆవుల శీను, ఫారుక్, బి శేఖర్, శివాచారి, కృష్ణయ్య, ముక్తార్, రాజు మేస్త్రి, కొత్తగొల్ల శంకర్, కె గిరి, డి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# మణిగిల్లలో మహిళా సంఘ సభ్యులకు రాత పరీక్షలు

- ఎన్ఐఓఎస్ పరీక్షలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

**వనపర్తి, మార్చి29(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్య, సాధికారత కల్పించేందుకు నిర్వహిస్తున్న ఎన్ఐఓఎస్ పరీక్షలు మణిగిల్ల గ్రామంలో విజయవంతంగా నిర్వహించారు. మహిళా సంఘం బుక్ కీపర్ శివ్వమ్మ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఏపీఎం సక్ర పాల్గొని పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పరీక్షలు రాశారు.ఈ సందర్భంగా మహిళలకు విద్యా అవకాశాలు కల్పించడం ద్వారా వారి సాధికారతకు దోహదపడుతుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్, యువత బోడి గణేష్, బి బాలకృష్ణ, ఎస్ మల్లికార్జున్, ప్రేమ్ కుమార్ రెడ్డి, బోయిన మహేష్, చెన్న కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధ్యాయుడు ధనరాజ్ రణదేవ్‌కు ఘన సన్మానం

- చిన్నారెడ్డి చేతుల మీదుగా సత్కారం, సేవలను కొనియాడిన నాయకులు

**వనపర్తి,మార్చి29(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మోజర్ల-మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవి విరమణ పొందిన ధనరాజ్ రణదేవ్‌ను వనపర్తి పట్టణంలోని ఆర్ జీ గార్డెన్‌లో నిర్వహించిన సభలో ఘనంగా సన్మానించారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సభకు ముఖ్య అతిథిగా హాజరై రణదేవ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి సమాజాన్ని చైతన్యపరిచే గొప్ప సేవామార్గమని తెలిపారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో పనిచేసిన రానదేవ్ విద్యాబోధనలో ప్రతిభ కనబరిచి అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు.ఉపాధ్యాయ వృత్తిలో క్రమశిక్షణ, స్నేహపూర్వక వైఖరితో అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. పదవి విరమణ అనేది సహజ ప్రక్రియ అని, రానదేవ్ భావి జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కోర్టు ప్లీడర్ కిరణ్ కుమార్, వనపర్తి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి మండల సామాజిక మాధ్యమ సమన్వయకర్త గట్టు రాజు, సీనియర్ నాయకులు అబ్దుల్లా, నందిమల్ల రామ్, ద్వారాపోగు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యాసేవలకు గౌరవం..

- తెలుగు ఉపాధ్యాయుడు సీహెచ్. వేణుకు ఉగాది పురస్కారం

**జమ్మికుంట టౌన్, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో నిర్వహించిన తెలుగు వెలుగు జాతీయ ఉగాది సాహితీ-సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇల్లందకుంట జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్. వేణుకు ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో విద్యా రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేయడం విశేషం. విద్యార్థుల్లో తెలుగు భాష పట్ల ఆసక్తి పెంపొందించడంలో, సాంస్కృతిక కార్యక్రమాల ప్రోత్సాహంలో ఆయన చూపిన కృషిని నిర్వాహకులు ప్రశంసించారు.

ఈ పురస్కారం అందుకోవడంతో పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు సీహెచ్. వేణును అభినందిస్తూ ఆయన సేవలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ అవార్డు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా రంగానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయుల ప్రతిభ వెలుగులోకి రావడం ఆనందదాయకమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ డివెర్షన్ రాజకీయాలు ఖండనీయం

- చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు డివెర్షన్ రాజకీయాలేనని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) తీవ్రంగా ఖండించారు. దళితుల కోసం నిరంతరం పోరాటం చేసిన నాయకుడిని రాజకీయంగా బలహీనపరచాలనే ఉద్దేశంతో ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

అసెంబ్లీలో రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ అంశంపై బీఆర్ఎస్ పార్టీ హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయగా, అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారని తెలిపారు. ఈ క్రమంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి అనని మాటలు అన్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దళితుల అభ్యున్నతే లక్ష్యంగా పని చేసే నాయకుడిగా కౌశిక్ రెడ్డి పేరుగాంచారని, ఆయనపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరిని బయట పెడుతోందని పేర్కొన్నారు. అసెంబ్లీ వీడియోలను ప్రజల ముందుకు తీసుకు రావాలని, నిజం బయటపడితే కాంగ్రెస్ డివెర్షన్ రాజకీయాలు బహిర్గతమవుతాయని అన్నారు. దళితుల గౌరవం కోసం పోరాటం ఆగదని, నిజం కోసం కౌశిక్ రెడ్డి గళం కొనసాగుతుందని మొలుగు ప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు.



# ఉప్పల్‌లో కరాటే సమ్మర్ క్యాంప్ ప్రారంభం

- చిన్నారుల సమగ్రాభివృద్ధికి క్రీడలు అవసరం
- పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ బాగాయత్‌లోని బజాజ్ షోరూమ్ సమీపంలో సెమ్సీ రామ్ ఫణేంద్ర కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరాటే సమ్మర్ క్యాంప్‌ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి చిన్నారులే భావి భారతానికి భవిష్యత్తు అని, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలే దేశానికి నిజమైన సంపద అని అన్నారు. పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు.గత 20 సంవత్సరాలుగా కరాటే మాస్టర్ రామ్ ఫణేంద్ర పిల్లలకు శిక్షణ ఇస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారని, ఆయన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కరాటే వంటి శిక్షణలు పిల్లల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, ధైర్యాన్ని పెంచుతాయని తెలిపారు.వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని పిల్లలు ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని మానసిక, శారీరకంగా దృఢంగా మారాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాశికంటి నాగరాజు, సల్ల ప్రభాకర్, ఈగ సంతోష్, పూజల ప్రభాకర్, బోడిగా ప్రభాకర్ గౌడ్, మంద మురళీ కృష్ణ రెడ్డి, గిరిదాస్ వెంకటేష్, శివ తదితరులు, కరాటే విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో వేలేరు విద్యార్థినికి ప్రథమ స్థానం

**వేలేరు, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో హన్మకొండ జిల్లా వేలేరు ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చిరంజీవి బత్తుల సాహితి ప్రథమ స్థానం సాధించింది.ఆమెకు రూ.2000 నగదు బహుమతి, మెమెంటో, శాలువాతో సత్కరించారు. ప్రముఖ సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ చేతుల మీదుగా బహుమతి అందించారు.ఈ కార్యక్రమం ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా దేవాలయంలో చక్రవర్తి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.వరంగల్, ములుగు జిల్లాల డీఈఓలు, ఏఎంఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో భక్తి శ్రద్ధలతో ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు






**హుజురాబాద్ టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలో క్రైస్తవుల పవిత్ర పండుగ మట్టల ఆదివారం (పామ్ సండే)ను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక సిఎస్ఐ ఫాస్ట్ రేట్ చైర్మన్ ఈ జాన్ బాబు గురువుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అంబేద్కర్ కూడలి వరకు ప్రత్యేక ఊరేగింపును చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు యేసు క్రీస్తు ప్రభువును స్తుతిస్తూ భక్తిగీతాలు ఆలపించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. చిన్నారులు నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రేట్ ఉమెన్ కమిటీ చైర్మన్ ఈ విజయమ్మ గారు, ఫాస్ట్ ట్రాక్ సెక్రటరీ సొల్లు బాబు, జి రవీందర్, ఎస్ మహేందర్, కె శంకర్, ఏ సిద్ధార్థ, అల్లపు ఏలియా, టి దేవదాస్, ఎం భాస్కర్, ఆర్ స్వామిదాస్, ఏ రంజిత్, సొల్లు సునీత, జి సురేఖ, బి కనకలక్ష్మి, కే సవిత, ఎస్ స్రవంతి, కె రజిత, పి లలిత, ఎస్ మని, కే సుకన్య, కే ఆశీర్వాద, డి రాణి, పుష్పలత, కే రాజేశ్వరి, ఏ ప్రియాంక, ఏ నీలమ్మ, కే అనుష, ఏ అర్చన తదితరులు పాల్గొన్నారు. భక్తుల ఐక్యత, భక్తి భావాలతో మట్టల ఆదివారం వేడుకలు హుజురాబాద్‌లో ఆధ్యాత్మికంగా, ఆనందంగా కొనసాగి ఘనంగా ముగిశాయి.

# దళిత ఎమ్మెల్యే పట్ల అవమానం.. కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి



_కాంగ్రెస్ నేత ప్రణవ్ డిమాండ్

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్‌లో రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు.

ఈ మేరకు హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. సీనియర్ దళిత నాయకుడైన కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు అసభ్యకరమని, ఇది దళితుల పట్ల వివక్షను సూచిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిని గౌరవించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అసెంబ్లీ వేదికగా అవమానకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ, ఇటువంటి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

ఇప్పటికైనా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన ప్రవర్తనపై వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ అంశం రాజకీయంగా మరింత చర్చకు దారి తీసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.





# 44వ వార్షికోత్సవం వేడుకల్లో మెరిసిన విద్యారణ్య ఆవాస విద్యాలయం

- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దిలీప్

**జమ్మికుంట టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యపీఠం ఆధ్వర్యంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 44వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు కలిసి చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 44 సంవత్సరాలుగా ఈ విద్యాలయం జమ్మికుంట పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి విలువలను ఈ విద్యాలయం అందిస్తున్నదని, అలాగే విద్యార్థుల శారీరక-మానసిక అభివృద్ధికి క్రీడలు, పోటీలను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్, ప్రధానాచార్యులు, ఆచార్యులు, శ్రీనివాస్ రెడ్డి, ముక్క జితేందర్, ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరితంగా కొనసాగి విజయవంతంగా ముగిశాయి.

# జై హనుమాన్ నినాదాలతో మారుమ్రోగిన మోతుకులగూడె

- ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**జమ్మికుంట టౌన్ మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు):**





మోతుకులగూడెం గ్రామం ఆదివారం సాయంత్రం భక్తిరసంతో కళకళలాడింది. స్థానిక భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని హనుమాన్ ఉత్సవమూర్తిని అలంకరించి నిర్వహించిన శోభాయాత్ర గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.

సాయంత్రం 5 గంటలకు మోతుకులగూడెం చౌరస్తా నుంచి ఘనంగా ప్రారంభమైన ఈ శోభాయాత్ర భూలక్ష్మి మహాలక్ష్మి ఆలయం వరకు జై హనుమాన్ నినాదాలతో మారుమ్రోగుతూ సాగింది. డప్పుల మోత, భక్తి గీతాలు, హారతుల మధ్య సాగిన ఈ ఊరేగింపు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది.

హనుమాన్ మాలదారులు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో ముందుకు సాగారు. గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయి, ఎక్కడ చూసినా భక్తి జ్వాలలు పరుచుకున్నాయి.

ఈ సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ శ్రీ పొనగంటి విష్ణు గారు ప్రసాద దాతగా ముందుకు వచ్చి భక్తులకు పులిహోర ఏర్పాటు చేయించడం విశేషం. శోభాయాత్ర అనంతరం భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు.

భక్తుల ఐక్యత, ఉత్సాహం, భక్తి భావం కలిసిన ఈ శోభాయాత్ర మోతుకులగూడెం గ్రామంలో చిరస్మరణీయంగా నిలిచింది.





# అన్నపూర్ణ కాలనీ కమిటీ భవనాన్ని ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్

_కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు కీలకం

– ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త వేదిక

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు)**

బోడుప్పల్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ భవనాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీకి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కరించుకునేందుకు కమిటీ భవనాలు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు.సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడంలో ఇలాంటి సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అదే విధంగా మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, బోడుప్పల్ అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు ఆనంద్, పద్మతో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక




## రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలి

–కారేపల్లి ఎస్సై గోపి

**ఖమ్మం బ్యూరో, మార్చి 29(తెలంగాణ ముచ్చట్లు):** రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలని కారేపల్లి ఎస్సై గోపి అన్నారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో ద్విచక్ర వాహన దారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ నిషేధమని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురు చూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు.




## డ్రైవింగ్ చేసే ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానంకి చేరాలి

–వైరా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్

**ఖమ్మం బ్యూరో, మార్చి 29(తెలంగాణ ముచ్చట్లు):** డ్రైవింగ్ చేసే ప్రతి పర్సన్ సురక్షితం గా గమ్యస్థానంకి చేరాలిని వైరా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్ కోరారు. అరైవ్-అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నేరడ గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రదేశం లో నిర్వహించారు. చింతకాని పోలీస్ వారి సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమం లో వైరా సీఐ మాట్లాడుతూ... ప్రతి వ్యక్తి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే అరైవ్-అలైవ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం, సేఫ్ అండ్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అనుసరించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రజలు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వర్వరావు గ్రామ పెద్దలు ఆలశ్యం వెంకయ్య ,మెడ బాబు నున్న వీరయ్య,ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్టా కాలేష్ ట్రాక్టర్ అసోసియేషన్ సైద ,రాగం లింగ బాబు.మట్ట రవి వార్డ్ మెంబర్స్ అమాడల్ వెంకటేశ్వర్లు సీపీఐ గ్రామ కార్యదర్శి ఎస్కే దస్తగిరి, ఎస్కే సుభాని,గుణగుంట్ల వెంకన్న ,గోగుల ఆదినారాయణ,పంచాయటీ సెక్రటరీ అర్జున్ తో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

_మౌంట్ జీయన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
– "హోసన్నా" నినాదాలతో మార్మోగిన కాలనీ, చిన్నారుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణ

**మౌలాలి, మార్చ్ 29 (తెలంగాణ ముచ్చట్లు)**

మౌలాలి హెచ్‌బి కాలనీ ఇందిరానగర్ ఫేజ్ 2లో మౌంట్ జీయన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించగా కాలనీ మొత్తం భక్తి పరవశంతో మార్మోగింది.కార్యక్రమాన్ని సంఘ కాపరి రెవ. కె. ఊర్మిళనంద్ ప్రార్థనతో ప్రారంభించారు. యేసుక్రీస్తు మట్టల ఆదివారం సందర్భంగా జరిగిన చారిత్రక ఊరేగింపును స్మరించుకుంటూ భక్తులు కాలనీలో ప్రదర్శనగా పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నారులు మట్టలు పట్టుకుని "హోసన్నా జయం జయం" అంటూ భక్తి గీతాలు ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 4వ డివిజన్ కార్పొరేటర్ జీరపోతుల ప్రభుదాసు హాజరై సంఘ సభ్యులను అభినందించారు. క్రైస్తవ జీవితంలో విశ్వాసం, సహనం ముఖ్యమని సంఘ కాపరి తన సందేశంలో పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువత, చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కే. ఇస్తేరమ్మ, కే. మరి, టీ సౌజన్య, కనకదుర్గ, కే. ఆనంద్ కుమార్, స్టీఫెన్, స్టెల్లా, ఏంజెల్ నేరయ్య, స్టెన్సి, నిధి జాన్, శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.ఈ ర్యాలీతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తి ఉత్సాహం వెల్లివిరిసింది.

## దమ్మాయిగూడలో మహనీయులకు ఘనంగా 9వ వారం జ్ఞానమాల

- అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ఆశయాలపై అవగాహన
- ముఖ్య అతిథిగా పిడమర్తి రవి ప్రసంగం

**దమ్మాయిగూడ, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్‌లో రాజీవ్ గృహకల్ప కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 9వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ స్టూడెంట్ జేఏసీ చైర్మన్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఫౌండర్, మాదిగ జేఏసీ ఫౌండర్, ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి ఫౌండర్ పిడమర్తి రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు సమాజ మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను అనుసరించి ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. జ్ఞానంతో ప్రపంచ మేధావిగా నిలిచిన అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివారం నిర్వహించే జ్ఞానమాల కార్యక్రమంలో కాలనీ ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేతరాజు ముదిరాజ్, మాల మహానాడు జిల్లా కన్వీనర్ గుజ్జుక పరశురాం, మాజీ కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్, ఆర్జీకే కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు రాములు, ఆర్జీకే అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గొల్లూరి రాజు, మాల సంఘం గౌరవ అధ్యక్షుడు తాడేపల్లి అబ్బులు, కోశాధికారి గాలి సురేష్, ప్రధాన కార్యదర్శి సానాది సాయిబాబ, కీసర అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు పులిపాక తిరుపతి, దమ్మాయిగూడ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాద్రాస్పల్లిలో అంటరానితనం ఘటనపై ప్రజలు ఆగ్రహం

- దళితులను ఆలయ వేడుకలకు అడ్డుకున్న ఘటన
- కఠిన చర్యల కోసం కీసర మండల నేతల డిమాండ్

**మేడ్చల్-మల్కాజిగిరి, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లోని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని యాద్రాస్పల్లి గ్రామంలో జరిగిన అంటరానితనం ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలకు హాజరైన దళితులను కొందరు వ్యక్తులు అడ్డుకోవడం తీవ్ర వివాదానికి దారితీసింది.ఈ ఘటనపై స్పందించిన కీసర మండల నాయకులు బాధిత కుటుంబాలతో సమావేశమై వారికి మద్దతు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో దళితులను కూర్చోనివ్వకుండా, కొబ్బరికాయలు కొట్టొద్దని దూషించిన వారిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనపై వెంటనే స్పందించిన శామీర్పేట్ పోలీసులకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఈ చర్యలను ఖండిస్తూ, సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. 1930లో డా. బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో జరిగిన దేవాలయ ప్రవేశ ఉద్యమాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామరం సుజాత, ఎమ్మార్పీఎస్ నేతలు బుడిగే జగన్, బక్కని కుమార్, తుడుం శ్రీనివాస్, చౌక్కాపురం శ్రీరాములు, చినింగని మల్లేష్, పోచయ్య, చౌక్కాపురం ప్రవీణ్, బండారి నరసింహారావు, బురిగల్ల మధు తదితరులు పాల్గొన్నారు.





## హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేయండి

- వైరా ఏసీపీ

**ఖమ్మం బ్యూరో, మార్చి 29(తెలంగాణ ముచ్చట్లు )**

ద్విచక్ర వాహనదారుల ప్రాణ రక్షణ కోసం ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని వైరా ఏసీపీ సారంగపాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సురక్షితమైన ప్రయాణాలను ప్రోత్సహించేందుకు వైరా డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ వైరా పట్టణంలో నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశ్యంతో "హెల్మెట్ ఆన్.. లైఫ్ ఆన్" వంటి నినాదాలతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుతూ, ప్రమాదాల సమయంలో తల గాయాలు కాకుండా హెల్మెట్ ఎలా రక్షిస్తుందో ఈ ర్యాలీ ద్వారా వివరించారు.
ఈ సందర్భంగా వైరా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. మనకోసం, మన ఇంటి వాళ్లు ఎదురు చూస్తుంటారని, మన ప్రాణాలు మన కుటుంబానికి ఎంతో ముఖ్యమని గుర్తించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఏసీపీ చేతుల మీదుగా హెల్మెట్ పంపిణి చేశారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్, ఎస్సైలు రామారావు, సూరాజ్, వెంకటకృష్ణ, వీరేందర్ పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు

- సిఐ సంజీవ్

**ఖమ్మం బ్యూరో, మార్చి 29(తెలంగాణ ముచ్చట్లు)**




డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని, కంటి చూపు బాగుంటేనే వాహనాన్ని సమర్థవంతంగా నడపగలుగుతారని కూసుమంచి సిఐ సంజీవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ మూడోవ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా.. రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో కూసుమంచి హైవే లో వెళ్తున్న భారీ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు శివ అప్టికల్స్ సహకారంతో కూసుమంచి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో, లారీ, ట్రాక్టర్, కారు డ్రైవర్లకు రోడ్డు భద్రతలో పాటించాల్సిన నియమాలపై సమగ్రంగా వివరించారు. ఈ శిబిరం ద్వారా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, క్రమం తప్పకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. చాలా మంది డ్రైవర్లు కంటి చూపును అశ్రద్ధ చేస్తున్నారనే ఉద్దేశంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూసుమంచి ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

# రాజస్థాన్ వీరత్వానికి, సంస్కృతికి నిలువుటద్దం

- రాజపుత్ర సంస్థానాల ఏకీకరణతో ఏర్పడిన భారత దేశపు అతిపెద్ద రాష్ట్రం
- చారిత్రక కట్టడాలు, అద్భుతమైన శిల్పకళా వైభవానికి రాజస్థాన్ చిరునామా
- పర్యాటక, పారిశ్రామిక మరియు ఇంధన రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు




**డెస్క్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశ చరిత్రలో రాజస్థాన్ రాష్ట్రానికి ఒక అద్వితీయమైన మరియు గౌరవప్రదమైన స్థానం ఉంది. శౌర్యప్రతాపాలకు, త్యాగనిరతికి మరియు అపారమైన కళా సంపదకు నిలయమైన ఈ ప్రాంతం, 1949 మార్చి 30న అధికారికంగా ఒక రాష్ట్రంగా రూపుదిద్దుకుంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ ప్రాంతం 'రాజపుతానా'గా పిలువబడేది, ఇక్కడ అనేక చిన్న మరియు పెద్ద స్వతంత్ర సంస్థానాలు పాలనలో ఉండేవి. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశ సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన విలీన ప్రక్రియలో భాగంగా జైపూర్, జోధ్‌పూర్, బీకానీర్ మరియు జైసల్మేర్ వంటి శక్తివంతమైన సంస్థానాలు కలిసి ప్రస్తుత రాజస్థాన్ రాష్ట్రంగా అవతరించాయి. ఈ చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏటా మార్చి 30వ తేదీని 'రాజస్థాన్ డే'గా రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ఉత్సాహంగా మరియు గర్వంగా జరుపుకుంటారు.

భౌగోళికంగా చూస్తే రాజస్థాన్ వైవిధ్యానికి పెట్టింది పేరు. దేశంలోనే వైశాల్యం పరంగా అతిపెద్ద రాష్ట్రమైన ఇది, ఒకవైపు అనంతమైన థార్ ఎడారితో, మరోవైపు పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణులతో నిండి ఉంటుంది. ఇక్కడి కోటలు, ప్యాలెస్‌లు మరియు అద్భుతమైన హవేలీలు నాటి రాజుల వైభవాన్ని, శిల్పకళా చాతుర్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపుతాయి. జైపూర్ (పింక్ సిటీ), ఉదయ్‌పూర్ (లేక్ సిటీ), జోధ్‌పూర్ (బ్లూ సిటీ) మరియు జైసల్మేర్ (గోల్డెన్ సిటీ) వంటి నగరాలు ప్రపంచ పర్యాటక రంగంలో తమకంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకున్నాయి. కేవలం పర్యాటకమే కాకుండా, రాజస్థాన్ తనదైన ప్రత్యేకమైన జానపద కళలు, సంగీతం మరియు నృత్య రీతులతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ముఖ్యంగా ఘూమర్, కల్బెలియా నృత్యాలు మరియు ఇక్కడి సంప్రదాయ వస్త్రధారణ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.

ఆర్థిక మరియు పారిశ్రామిక రంగాల్లో రాజస్థాన్ రాష్ట్రం గణనీయమైన ప్రగతిని సాధిస్తూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. సహజ వనరులు మరియు ఖనిజ సంపదలో ఈ రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోంది. ముఖ్యంగా అత్యుత్తమ నాణ్యత కలిగిన పాలరాయి సున్నపురాయి, రాగి మరియు జింక్ ఉత్పత్తిలో రాజస్థాన్ దేశంలోనే ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తాజ్ మహల్ నిర్మాణానికి వాడిన మక్రానా మార్బుల్ ఇక్కడి నుండే సేకరించబడింది. పారిశ్రామికీకరణ వేగవంతం కావడంతో జౌళి, హస్తకళలు మరియు రత్నాల పరిశ్రమలు వేలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు మరియు మౌలిక సదుపాయాల కారణంగా అనేక బహుళజాతి కంపెనీలు ఇక్కడ తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి.

ఇక ఇంధన రంగం విషయానికి వస్తే, రాజస్థాన్ దేశానికే ఇంధన భాండాగారంగా మారుతోంది. ఎడారి ప్రాంతం కావడం వల్ల ఇక్కడ ఏడాది పొడవునా సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది, దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వం భారీ ఎత్తున సౌర విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టింది. ప్రస్తుతం భారతదేశంలోనే అత్యధిక సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో రాజస్థాన్ ఒకటిగా నిలుస్తోంది. జోధ్‌పూర్ జిల్లాలోని భడ్లా సోలార్ పార్క్ ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కులలో ఒకటిగా గుర్తింపు పొందింది. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో రాజస్థాన్ చూపుతున్న చొరవ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. కేవలం సౌర విద్యుత్తు మాత్రమే కాకుండా, పవన విద్యుత్ రంగంలో కూడా రాష్ట్రం గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తూ హరిత ఇంధన లక్ష్యాల దిశగా పయనిస్తోంది.

వ్యవసాయ రంగంలో కూడా రాజస్థాన్ అద్భుతమైన మార్పులను చూసింది. ఒకప్పుడు నీటి ఎద్దడితో అల్లాడిన ఎడారి ప్రాంతాలు, ఇప్పుడు ఇందిరా గాంధీ కెనాల్ ప్రాజెక్టు వల్ల పచ్చని పొలాలుగా మారాయి. ఈ కాలువ ద్వారా సాగునీటి సౌకర్యం మెరుగుపడటంతో గోధుమలు, ఆవాలు, పప్పు ధాన్యాలు మరియు పత్తి సాగు ఇక్కడ ప్రధానంగా సాగుతోంది. ఆవాల ఉత్పత్తిలో రాజస్థాన్ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం విశేషం. అంతేకాకుండా, పశుసంవర్ధక రంగం ఇక్కడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. గొర్రెలు, మేకలు మరియు ఒంటెల పెంపకం ద్వారా లక్షలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. పాల ఉత్పత్తిలో కూడా ఈ రాష్ట్రం దేశంలోని మొదటి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా ఉండి, శ్వేత విప్లవంలో తనవంతు భాగస్వామ్యాన్ని అందిస్తోంది.

సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే, ఆధునిక విద్యారంగంలో రాజస్థాన్ విశేషమైన గుర్తింపును పొందింది. ముఖ్యంగా కోటా నగరం దేశవ్యాప్తంగా 'కోచింగ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచింది. ఐఐటి మరియు నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే లక్షలాది మంది విద్యార్థులు ప్రతి ఏటా ఇక్కడికి వస్తుంటారు. అలాగే, జైపూర్‌లో జరిగే 'లిటరేచర్ ఫెస్టివల్' ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత సాహిత్య ఉత్సవంగా గుర్తింపు పొందింది, ఇది అంతర్జాతీయ మేధావులను మరియు రచయితలను ఒకే వేదికపైకి తీసుకువస్తోంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు మరియు పరిశోధనా సంస్థలు నూతన ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయి. సంప్రదాయ విలువలను గౌరవిస్తూనే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడంలో రాజస్థాన్ ముందు వరుసలో ఉంది.

రాజస్థాన్ ఆహార సంస్కృతి కూడా పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. నీటి లభ్యత తక్కువగా ఉన్నా, ఉన్న వనరులతోనే రుచికరమైన వంటకాలను తయారు చేయడంలో ఇక్కడి వారు సిద్ధహస్తులు. ప్రసిద్ధ 'దాల్ బాటి చుర్మా', 'లాల్ మాస్', మరియు వివిధ రకాల మిఠాయిలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. 'అతిథి దేవో భవ' అనే సూత్రాన్ని తు.చ. తప్పకుండా పాటిస్తూ, 'పధారో మారో దేశ్' (మా దేశానికి రండి) అనే నినాదంతో అతిథులను ఆదరించే రాజస్థానీయుల మనస్తత్వం అందరినీ ఆకట్టుకుంటుంది. ఇక్కడి పండుగలు, ముఖ్యంగా పుష్కర్ మేళా మరియు గంగౌర్ ఉత్సవాలు రాష్ట్రం యొక్క రంగులమయమైన జీవనశైలిని మరియు మతపరమైన సామరస్యాన్ని ప్రతిబింబిస్తాయి. ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక లేదా పురాణ గాథ ఉండటం ఇక్కడి ప్రత్యేకత. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జైపూర్‌లోని జనపథ్ మరియు ఇతర ప్రధాన నగరాల్లో భారీ ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా జానపద కళాకారుల ప్రదర్శనలు, కవాతులు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు మిన్నంటుతాయి. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాదు, రాజస్థాన్ ప్రజల ఆత్మగౌరవాన్ని, వారి పోరాట పటిమను మరియు ఐక్యతను చాటి చెప్పే సందర్భం. గత ఏడు దశాబ్దాల్లో ఎడారి ప్రాంతం నుండి పారిశ్రామిక మరియు విద్యా కేంద్రంగా రాజస్థాన్ ఎదిగిన తీరు అద్భుతమైనది. రాబోయే కాలంలో మరింత సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ, పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామిక వృద్ధిని లక్ష్యంగా చేసుకుని రాజస్థాన్ ముందుకు సాగుతోంది. ఈ మహత్తరమైన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ రాజస్థాన్ ఘన చరిత్రను స్మరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు.

# 44 ఏళ్ల రాజకీయ ప్రస్థానం

- తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ
- సంచలన విజయాలు మరియు విప్లవాత్మక సంక్షేమ పథకాలు
- నవ్యాంధ్ర నిర్మాణంలో చంద్రబాబు నాయుడు దార్శనికత
- తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం

**డెస్క్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ రాజకీయ యవనికపై ఒక ప్రాంతీయ పార్టీ సృష్టించిన ప్రభంజనం గురించి చర్చ వస్తే మొదటగా వినిపించే పేరు తెలుగుదేశం. 1982 మార్చి 29వ తేదీన హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విశ్వవిఖ్యాత నందమూరి తారక రామారావు గారు ఈ పార్టీని స్థాపించారు. అప్పటి వరకు వెండితెరపై దైవ సమానుడిగా ఆరాధించబడిన ఎన్టీఆర్, తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతింటోందని భావించి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఢిల్లీ పాలకుల ప్రాబల్యాన్ని ఎదిరించి, తెలుగు గడ్డపై తెలుగువాడే పాలకుడు కావాలనే నినాదంతో ఆయన చేపట్టిన చైతన్య రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా అపూర్వ స్పందనను పొందింది. పార్టీ స్థాపించిన కేవలం తొమ్మిది నెలల కాలంలోనే అఖండ విజయం సాధించి, అధికారాన్ని చేజిక్కించుకోవడం భారత రాజకీయ చరిత్రలో ఒక అరుదైన మరియు అపురూపమైన రికార్డుగా నిలిచిపోయింది.

ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలు తెలుగు సమాజంపై చెరగని ముద్ర వేశాయి. ముఖ్యంగా రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం పేదవాడి ఆకలిని తీర్చడంలో గొప్ప మైలురాయిగా నిలిచింది. బలహీన వర్గాలకు రాజకీయ గుర్తింపునివ్వడంలో టీడీపీ కీలక పాత్ర పోషించింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సామాన్యులను కూడా నాయకులుగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. అలాగే మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించడం, పటేల్‌పట్వారీ వ్యవస్థ రద్దు వంటి నిర్ణయాలు గ్రామీణ వ్యవస్థలో సమూల మార్పులకు కారణమయ్యాయి. ఈ సంస్కరణలు కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా, దేశంలోని ఇతర రాష్ట్రాలకు మరియు కేంద్ర ప్రభుత్వాలకు కూడా దిక్సూచిగా నిలిచాయి. ఎన్టీఆర్ తర్వాత పార్టీ పగ్గాలను చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు, పార్టీని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించారు. 1990వ దశకంలో ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ హబ్‌గా మార్చడంలో ఆయన కృషి అనన్యసామాన్యం. హైదరాబాద్‌ను హైటెక్ సిటీగా తీర్చిదిద్ది, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలను రప్పించడం ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ అభివృద్ధి మరియు సంక్షేమం అనే రెండు చక్రాలపై పయనించింది. విజన్ 2020 వంటి ప్రణాళికలతో రాష్ట్ర భవిష్యత్తును ముందుగానే దర్శించిన నేతగా ఆయన గుర్తింపు పొందారు. కేవలం రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా, కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో చక్రం తిప్పి, జాతీయ రాజకీయాల్లో కింగ్ మేకర్‌గా టీడీపీ తన సత్తా చాటింది.

తెలుగుదేశం పార్టీ ప్రస్థానంలో అనేక సవాళ్లు, ఆటంకాలు ఎదురయ్యాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడటమే పార్టీ సిద్ధాంతంగా సాగింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర నిర్మాణంలో టీడీపీ కీలక పాత్ర పోషించింది. రాజధాని అమరావతి నిర్మాణం మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం అహర్నిశలు శ్రమించింది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా కార్యకర్తల బలమే ఈ పార్టీకి శ్రీరామరక్ష. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల సైన్యం ఉండటమే పార్టీ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానానికి ప్రధాన కారణం. నాయకత్వం మారినా, తరాలు మారినా పసుపు జెండా రెపరెపలాడటమే టీడీపీ బలాన్ని సూచిస్తుంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో కూడా తెలుగుదేశం తన ఉనికిని చాటుకుంటూనే ఉంది. యువ నాయకత్వం వైపు అడుగులు వేస్తూ లోకేష్ వంటి నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని ఉన్న లక్షలాది మంది కార్యకర్తలు పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. కాలంతో పాటు మారుతున్న ఓటర్ల నాడిని పసిగడుతూ, డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకుంటూ ప్రజల్లోకి వెళ్తోంది. మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మిత్రపక్షాలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని మళ్లీ పొందడానికి పార్టీ శ్రమిస్తోంది. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నాటి నుండి నేటి వరకు పార్టీ ఎదుర్కొన్న ఒడిదుడుకులు కార్యకర్తలకు ఒక పాఠం లాంటివి. వెన్నుపోటు ఆరోపణలు, ఎన్నికల ఓటములు, నాయకుల వలసలు వంటి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, పార్టీ పునాదులు మాత్రం చెక్కుచెదరలేదు. బీసీల పార్టీగా ముద్రపడిన టీడీపీ, ఆ వర్గాలకు సామాజిక న్యాయం అందించడంలో ఎప్పుడూ ముందుంటుంది. పార్టీలో పదవుల కేటాయింపులో గానీ, టికెట్ల పంపిణీలో గానీ సామాజిక సమతుల్యతను పాటించడం టీడీపీ సంప్రదాయం. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూనే, ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా పార్టీ విధివిధానాలను చంద్రబాబు నాయుడు మలుచుకుంటూ వస్తున్నారు.

తెలుగు గడ్డపై ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం రాజకీయాల్లో ఒక నూతన శకాన్ని ప్రారంభించింది. అంతవరకు ఉన్న ఏకపక్ష రాజకీయాలకు టీడీపీ స్వస్తి పలికింది. బలమైన ప్రతిపక్షంగా నిలబడినా, బాధ్యతాయుతమైన అధికార పక్షంగా వ్యవహరించినా టీడీపీకి సాటిలేదని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడటం, అవసరమైనప్పుడు జాతీయ ప్రయోజనాల కోసం రాజీ పడకుండా నిలబడటం ఈ పార్టీ నైజం. ముఖ్యంగా తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు టీడీపీ చేసిన కృషి మరువలేనిది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఏకం చేయడంలో 'తెలుగుదేశం' అనే పేరులోనే ఒక ఆత్మీయత ఉందనేది వాస్తవం. చంద్రబాబు నాయుడు అనుభవం మరియు దార్శనికత పార్టీకి పెద్ద ఆస్తి. క్లిష్ట సమయాల్లో ఆయన తీసుకునే నిర్ణయాలు పార్టీని గట్టెక్కిస్తూ వస్తున్నాయి. ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు, నేటి యువత ఆకాంక్షలకు అను□□ణంగా పార్టీని మలచడంలో నిరంతరం కృషి చేస్తున్నారు. సంక్షేమ పథకాలను కేవలం ఓట్ల కోసం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను పెంచే సాధనాలుగా ఆయన పరిగణిస్తారు. నాలెడ్జ్ ఎకానమీ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై ఆయనకు ఉన్న పట్టు పార్టీని ఇతర పార్టీల కంటే భిన్నంగా నిలబెడుతుంది. రానున్న ఎన్నికలే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంలో ఆయన వ్యూహాలు పదునుగా మారుతున్నాయి.

పార్టీ ఆవిర్భావ దినోత్సవం అంటే కేవలం పండుగ మాత్రమే కాదు, అది ఒక ఆత్మపరిశీలన చేసుకునే సమయం. గడిచిన నాలుగు దశాబ్దాల్లో సాధించిన విజయాలు, ఎదురైన వైఫల్యాలను సమీక్షించుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం పార్టీకి అత్యవసరం. ప్రస్తుత సంక్లిష్ట రాజకీయ వాతావరణంలో కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకురావడం మరియు యువతను పార్టీ వైపు ఆకర్షించడం పెద్ద సవాలు. అయినప్పటికీ, ఎన్టీఆర్ వారసత్వం మరియు చంద్రబాబు దార్శనికత ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ తెలుగువారి గుండెల్లో పదిలంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసే నాయకులే పార్టీకి నిజమైన ఆస్తి. చివరగా, తెలుగుదేశం పార్టీ ప్రస్థానం అనేది తెలుగు జాతి సాధికారత ప్రస్థానం. పేదరికం లేని సమాజం, తెలుగువారికి ప్రపంచవ్యాప్త గుర్తింపు అనే ఆశయాలతో మొదలైన ఈ ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతోంది. 44వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ తరుణంలో, పార్టీ శ్రేణులన్నీ ఏకమై తెలుగు ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం పునరంకితం కావాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం అనేది ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, అది కోట్ల మంది తెలుగువారి భావోద్వేగం మరియు భరోసా. ఈ ప్రత్యేక సందర్భంగా తెలుగుదేశం అభిమానులకు మరియు కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సంపాదకీయ వ్యాసం.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా

- మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఏప్రిల్‌లో పోలింగ్ - మే 4న ఫలితాలు
- ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం - జాతీయ పార్టీల సవాలు
- కొత్త పొత్తులు మరియు కీలక అభ్యర్థుల వ్యూహాలు



**డెస్క్, మార్చి 29 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశంలో అత్యంత కీలకమైన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం మరియు పుదుచ్చేరిలలో ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, అస్సాం, కేరళ మరియు పుదుచ్చేరిలలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న ఎన్నికలు జరగనుండగా, పశ్చిమ బెంగాల్‌లో మాత్రం ఏప్రిల్ 23 మరియు 29 తేదీల్లో రెండు విడతలుగా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఐదు ప్రాంతాల్లోని మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు జరిగే ఈ ఎన్నికల ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసి, ప్రచారం జోరందుకుంది.

తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ఆసక్తికరమైన మార్పులు కనిపిస్తున్నాయి. అధికార డిఎంకె తన పట్టును నిలబెట్టుకోవడానికి ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ నాయకత్వంలో వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే 164 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన డిఎంకె, తన మిత్రపక్షాలతో కలిసి బరిలోకి దిగుతోంది. మరోవైపు ఏఐఏడీఎంకె ఈసారి బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా పవర్‌లోకి రావాలని ప్రయత్నిస్తోంది. తాజాగా మార్చి 29న విడుదల చేసిన జాబితాలో మాజీ మంత్రులకు పెద్దపీట వేసింది. వీరికి తోడుగా సినీ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం' పార్టీ ఒక వైల్డ్ కార్డ్ ఎంట్రీలా మారి, సంప్రదాయ ఓటు బ్యాంకుకు గండికొట్టేలా కనిపిస్తోంది. ఇది ద్రవిడ రాజకీయాల్లో ఒక కొత్త మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, బీజేపీ అక్కడ గట్టి పోటీనిస్తోంది. సువేందు అధికారి వంటి బలమైన నేతలు మమతా బెనర్జీకి సవాలు విసురుతున్నారు. గతంలో ఎనిమిది విడతలుగా జరిగిన బెంగాల్ ఎన్నికలు, ఈసారి కేవలం రెండు విడతల్లోనే ముగియడం విశేషం. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించాలని చూస్తుండగా, యూడీఎఫ్ మరియు ఎన్డీయే కూటములు ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై ఆశలు పెట్టుకున్నాయి. అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అభివృద్ధి మంత్రంతో దూసుకుపోతుండగా, ప్రతిపక్ష కాంగ్రెస్ మరియు ప్రాంతీయ పార్టీలు 'అసోం సన్మిలితో మోర్చా' పేరుతో ఏకమై గట్టి పోటీనిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఈసారి భద్రత మరియు పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పును వెలువరించనున్నారు. సుమారు 25 లక్షల మంది ఎన్నికల సిబ్బంది మరియు 4.85 లక్షల మంది భద్రతా దళాలను ఈ ఐదు రాష్ట్రాల్లో మోహరించారు. ముఖ్యంగా సున్నితమైన ప్రాంతాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఓటర్లను ఆకర్షించేందుకు నగదు మరియు ఇతర తాయిలాల పంపిణీపై ఈసీ కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 400 కోట్లకు పైగా అక్రమ నగదు మరియు వస్తువులను సీజ్ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అభ్యర్థుల గుర్తింపు కోసం బ్యాలెట్ పేపర్లపై రంగుల ఫోటోలను ముద్రించడం వంటి నూతన మార్పులను కూడా ఈసారి ప్రవేశపెట్టారు.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రాంతీయ పార్టీల బలం పెరగడమా లేక జాతీయ పార్టీల ప్రాభవం పెరగడమా అనేది మే 4న తేలిపోనుంది. ఎగ్జిట్ పోల్స్‌పై ఇప్పటికే ఏప్రిల్ 29 వరకు నిషేధం విధించడంతో, ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందనేది ఉత్కంఠగా మారింది. ప్రజా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలు మరియు అభివృద్ధి అంశాలే ప్రధాన అజెండాగా పార్టీలు ప్రచారం సాగిస్తున్నాయి. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ప్రశాంతంగా ముగిసేలా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

సోమవారం - 30 - మార్చి 2026


తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పొంగులేటి ప్రజాదరణను చూసి జీర్ణించుకోలేకనే ఆరోపణలు

## డాక్టర్ పిడమర్తి రవి, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్



**హన్మకొండ,మార్చి29(తెలంగాణ ముచ్చట్లు):** పొంగులేటి ప్రజాదరణను జీర్ణించుకోలేకనే ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి పేర్కొన్నారు. అసెంబ్లీలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని టిఆర్ఎస్ శాసనసభ్యుడు హరీష్ రావుపై విమర్శలు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను చూసి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు.రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో విజయవంతంగా ఎదిగి సంపాదించిన సంపదను ప్రజల సేవకే వినియోగించేందుకు రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ప్రజల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తన కష్టార్జితాన్ని వినియోగిస్తున్నారని చెప్పారు. అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆవరణగా ఉపయోగించుకుని కొందరు అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. మైనింగ్ రంగంలో అక్రమాలు జరుగుతున్నాయన్న విషయంపై కూడా విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీలో అలాంటి వ్యవహారాలకు చోటు లేదని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.




# ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం విడుదలకు ముందే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. గతంలో వీరి కలయికలో వచ్చిన 'గబ్బర్ సింగ్' ఘన విజయం సాధించడంతో ఈ సినిమా పట్ల అభిమానుల్లో మరింత ఆసక్తి నెలకొంది.
ఈ చిత్రంలో శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటించడం కూడా సినిమాకు మంచి క్రేజ్ తెచ్చింది. భారీ అంచనాల నడుమ మార్చి 19న విడుదలైన ఈ చిత్రం మొదటి రోజుల్లో మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో నిలవలేకపోయింది. కథ, ప్రదర్శనపై మిశ్రమ అభిప్రాయాలు రావడంతో పాటు అదే సమయంలో విడుదలైన ధురంధర్ 2 ఘన విజయంతో ఈ సినిమాపై ప్రభావం పడింది. దీంతో థియేటర్లలో ఈ సినిమా హవా క్రమంగా తగ్గింది. ఈ పరిస్థితుల్లో నిర్మాతలు కీలక నిర్ణయం తీసుకుని చిత్రాన్ని త్వరగా డిజిటల్ వేదికపై విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రముఖ డిజిటల్ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా ప్రసార హక్కులను ఇప్పటికే సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని ఏప్రిల్ 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశముంది. థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయిన ఈ చిత్రం, డిజిటల్ వేదికపై ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.
ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ చిత్రాన్ని డిజిటల్ వేదికపై మరింత ఆదరిస్తారని సినీ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో కూడా ఆయన చిత్రాలకు డిజిటల్ వేదికలపై మంచి స్పందన లభించిన నేపథ్యంలో ఈ సినిమాపై కూడా అదే ఆశలు నెలకొన్నాయి.
మొత్తానికి, భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం అక్కడ పూర్తిస్థాయిలో రాణించలేకపోయినా, ఇప్పుడు డిజిటల్ వేదికపై తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.

# హాట్‌గా.. బోల్డ్‌గా 'కాక్‌టెయిల్ 2'



బాలీవుడ్‌లో గ్లామర్‌తో పాటు నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కృతి సనన్ తాజా చిత్రం 'కాక్‌టెయిల్ 2'తో మళ్లీ వార్తల్లో నిలిచింది. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా కృతి చేసిన కామెంట్స్ మరింత హాట్ టాపిక్‌గా మారాయి. ఈ చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఇందులో కృతి పాత్ర ఇప్పటివరకు ఆమె చేసిన పాత్రలతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉండబోతుందని చెప్పడం విశేషం.
ఈ సినిమాలో తన పాత్ర చాలా హాట్‌గా, బోల్డ్‌గా ఉంటుందని కృతి సనన్ స్వయంగా వెల్లడించింది. ఇప్పటివరకు తాను చేయని తరహా పాత్ర ఇది అని, ప్రేక్షకులకు ఇది ఒక పెద్ద సర్‌ప్రైజ్ అవుతుందని తెలిపింది. మోడ్రన్ రిలేషన్‌షిప్స్, లవ్, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం యువతను ఎక్కువగా ఆకట్టుకునేలా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మరో స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా కూడా కీలక పాత్రలో కనిపించనుంది. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ముఖ్యంగా కృతి – రష్మిక మధ్య వచ్చే సన్నివేశాలు కథకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ, ఎమోషనల్ సీన్స్‌తో పాటు బోల్డ్ మూమెంట్స్ కూడా సినిమాకు ప్రత్యేక హైలైట్ అవుతాయని టాక్. ఇక ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు హోమీ అదజానియా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఆయన తీసిన చిత్రాలు వినూత్న కథలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అదే తరహాలో 'కాక్‌టెయిల్ 2'ను కూడా కొత్త తరహా కథతో, స్టైలిష్ ప్రెజెంటేషన్‌తో తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా కథ దేరింగ్‌గా ఉండటమే కాకుండా, పాత్రల మధ్య సంబంధాలను చాలా రియలిస్టిక్‌గా చూపించబోతున్నారని సమాచారం. ముఖ్యంగా మహిళా పాత్రలను బలంగా చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ కారణంగానే కృతి సనన్ ఈ ప్రాజెక్ట్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలకు ముందు నుంచే ఈ సినిమా చుట్టూ భారీ హైప్ ఏర్పడింది. కృతి సనన్ చెప్పినట్లుగానే పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుందా? లేక వివాదాలకు దారి తీస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి 'కాక్‌టెయిల్ 2' ఈ ఏడాది బాలీవుడ్‌లో అత్యంత చర్చనీయాంశంగా మారే సినిమాల్లో ఒకటిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.



# వ్యోమగామి కల వదిలి.. నటిగా మాళవిక ప్రయాణం

గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మాళవిక నాయర్ టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తక్కువ సినిమాలే చేసినప్పటికీ, ప్రతి పాత్రలోనూ సహజమైన నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించారు. ప్రస్తుతం శర్వానంద్ సరసన తెరకెక్కుతున్న 'బైకర్' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఢిల్లీలో జన్మించి, కొచ్చిలో పెరిగిన మాళవికకు చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి ఎక్కువ. ముఖ్యంగా విజ్ఞానశాస్త్రంపై మంచి పట్టు కలిగిన ఆమె ఒకప్పుడు వ్యోమగామి కావాలని కలలు కనేవారట. చదువుతో పాటు ఈతలో పతకాలు సాధించడంతో పాటు నృత్యం, చిత్రలేఖనం వంటి రంగాల్లోనూ శిక్షణ పొందారు. అయితే ఆమె జీవిత మార్గాన్ని మార్చింది కుటుంబం, ముఖ్యంగా తండ్రి ప్రోత్సాహమే. మాళవిక సినిమాల్లోకి రావడానికి ఆమె తండ్రి శశి నాయర్ ముఖ్య కారణమయ్యారు. నటుడిగా ఎదగాలన్న తన కల నెరవేరకపోవడంతో, తన కుమార్తెను వెండితెరపై చూడాలని ఆశపడ్డారు. ఆ ఆశయమే మాళవికను మోడలింగ్ వైపు తీసుకెళ్లి, అక్కడి నుంచి సినిమా రంగంలోకి అడుగుపెట్టేలా చేసింది.
దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించిన ఎవడే సుబ్రహ్మణ్యం చిత్రంతో మాళవిక టాలీవుడ్‌లోకి ప్రవేశించారు. ఆ సినిమాలో 'ఆనంది' పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత కల్యాణ వైభోగమే చిత్రంలో నాగశౌర్య సరసన నటించి కుటుంబ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఇక మహానటి చిత్రంలో జమున పాత్రలో కనిపించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. అలాగే టాక్సీవాలా, అన్ని మంచి శకునములే వంటి చిత్రాల్లోనూ ఆమె చేసిన పాత్రలకు మంచి గుర్తింపు లభించింది. ప్రతి సినిమాలో కొత్తదనం చూపించేందుకు ఆమె ప్రయత్నించడం ఆమె ప్రత్యేకతగా మారింది. తన కెరీర్‌లో ఎదురైన అనుభవాలను కూడా మాళవిక ఆసక్తికరంగా పంచుకున్నారు. విజేత చిత్రంలో నటించే సమయంలో స్కూటీ నడపడం రాకపోయినా, పాత్ర కోసం కష్టపడి నేర్చుకున్నట్లు తెలిపారు. రెండు మూడు సార్లు పడిపోయినా పట్టుదలతో సాధించానని చెప్పడం ఆమె కృషికి నిదర్శనం. అలాగే మలయాళంలో యాసిడ్ బాధితురాలిగా, తమిళంలో అంధురాలిగా నటించడం తనకు నటనలో కొత్త అనుభవాలను ఇచ్చిందని వెల్లడించారు. ఇక ప్రస్తుతం అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో, శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'బైకర్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న మాళవిక, ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 3న విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.




# 'అనకాపల్లి' టీజర్‌తో ఆకట్టుకుంటున్న మాస్ కథ

టాలీవుడ్‌లో మరో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'అనకాపల్లి' సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. యంగ్ నటుడు విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం తాజాగా విడుదల చేసిన టీజర్‌తోనే మంచి హైప్‌ను సొంతం చేసుకుంది. పల్లెటూరి నేపథ్యంలో సాగే కథ, ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ టీజర్‌లో విక్రమ్ సాహిదేవ్ కొత్త లుక్‌లో కనిపిస్తూ, తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాడు. అతడి పాత్రలో ఉన్న తీవ్రత, ఎమోషన్, యాక్షన్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప కూడా తమ పాత్రలతో కథలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన కథ, కథనం అందించడం విశేషం. వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన శైలిలోనే ఈ సినిమా కూడా ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నక్కిన నరేటివ్స్, భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాంద్రేగుల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం టీజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in